క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

రేపు శనిదోష పరిహార పూజలు

ఆదోని అర్బన్: శనిత్రయోదశి సందర్భంగా శనివారం మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనిదోష పరిహార పూజలు చేపడుతున్నట్లు ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ గురువారం తెలిపారు. ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శనీశ్వరమూర్తికి తైలాభిషేకం, శాంతిహోమం నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది అర్ధాష్టమ, అష్టమ, ఏలినాటి శనిదోషములతో బాధలు, కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలతో బాధపడుతున్న కర్కాటక, కన్య, కుంభ, మకర, మీన, వృశ్చిక రాశుల వారికి శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల వారి ఆదేశాల మేరకు శనిదోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిహార పూజలు చేయించుకోదలిచిన భక్తులు 9110731103 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అయ్యప్పస్వామికి పూజలు

ఆదోని అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలిసిన కోర్టు గుడిలో ఉన్న అయ్యప్పస్వామికి తోమలసేవ పూజలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ఏకాదశి సందర్భంగా గురువారం గురుస్వామి మోహన్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం, నైవేద్యం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి గీతాలను మాలధారులు ఆలకించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. గురువారం మండల పరిధిలోని కందనాతి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, రికార్డులు, ఆన్‌లైన్లో పాస్ పుస్తకాలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించాలన్నారు.

గడువులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ రహదారి వైపు నిర్మిస్తున్న రోడ్డు పనులను గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. గురువారం రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

3వ తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

ఎమ్మిగనూరుటౌన్: సామాజిక సంఘ సంస్కర్త మహాత్మాజ్యోతిరావ్ పూలే సతీమణి భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయ్ పూలే జయంతి జనవరి 3వ తేదీన కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.మాదన్న కోరారు. గురువారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూలే దంపతులు వారి జీవిత కాలంలో 58 పాఠశాలలు స్థాపించిన గొప్ప సంస్కర్తలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: పట్టణంలోని హవన్నపేటకు చెందిన అలివేలు అనే మహిళ కుటుంబ కలహాలతో నిద్ర మాత్రలు మింగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఔట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపారు. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారని తెలిపారు.

మధ్యంతర భృతి ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి తాయప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ హైస్కుల్ ఆవరణలో ఆ సంఘ పట్టణ అధ్యక్షుడు ఉరుకుందా రెడ్డి అధ్యక్షతన ఆపస్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

గృహయోగం.. అయోమయం !

- మధ్య తరగతి ప్రజలకు మొండిచేయి
- ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌లపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- మౌలిక వసతుల కల్పనపై టెండర్లకు క్లియరెన్స్‌లు ఇవ్వని వైనం



బనవాసి వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్‌టౌన్‌షిప్ ప్రాంతం



మౌలిక వసతుల్లేక స్మార్ట్‌టౌన్‌షిప్‌లో విస్తరిస్తున్న ముళ్లపొదలు

ఎమ్మిగనూరు: దారిద్య్రరేఖకు దిగువనున్న పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మించి ఏకంగా కొత్త కాలనీలు, కొత్త ఊళ్లనే సృష్టించింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అదేవిధంగా పట్టణ మధ్యతరగతి వర్గాలకు సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్మార్ట్‌టౌన్‌షిప్‌లకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లింపుదారులకు ఎంఐజీ లే అవుట్లను ఏర్పాటు చేసి సకల సాకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. అయితే ఆతురువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బృహత్తర లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. బనవాసి స్మార్ట్‌టౌన్ షిప్‌లలో మౌలిక వసతుల కల్పనకు ఖరారైన టెండర్లకు మున్సిపల్ శాఖ క్లియరెన్స్‌లు ఇవ్వకుండా నిలిపివేసింది. దీంతో స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేస్తారా? లేదా వదిలేస్తారా అని స్థలాలు కొన్న ఉద్యోగులు, వ్యాపారులు అయోమయంలో పడ్డారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్‌టౌన్‌షిప్

ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాలవారికి ఎమ్మిగనూరు (బనవాసి) ఎమ్మిగనూరు-ఆదోని ప్రధాన రహదారి (ఎన్‌హెచ్-167) పక్కనే, జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో గత ప్రభుత్వం అన్ని క్లియరెన్స్‌లు ఇచ్చి స్మార్ట్ టౌన్‌షిప్‌కు దరఖాస్తులు స్వీకరించింది. ఎమ్మిగనూరు పట్టణానికి ఆరు కిలోమీటర్ల సమీపంలో బనవాసి అటవీ భూములు ఉన్నాయి. పశు సంవర్ధకశాఖకు చెందిన రెండువేల ఎకరాల్లో నుంచి 110.10 ఎకరాల్లో ఎంఐజీ కాలనీ నిర్మిస్తే ఉద్యోగులకు, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని అప్పటి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఎకరం భూమిధర రూ.36లక్షలు చొప్పున పశుసంవర్ధకశాఖకు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగం జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో ఆదోని-ఎమ్మిగనూరు ప్రధాన రహదారి పక్కనే సర్వేనెంబర్లు 313, 314, 324, 325, 326, 342లో ఉన్న 110.10 ఎకరాలను ఎంఐజీ కాలనీ కోసం సేకరించారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ(కుడా) లే అవుట్ (ఎల్‌పీ నెం.19/2022/ఎంఐజీ/ఏ) అప్రూవల్ కూడా ఇచ్చింది. దీంతో గమధ్యతరగతి వర్గాలకు పచ్చదనపు ఆహ్లాదం..హైవే సదుపాయలతో అందమైన కాలనీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ఎంఐజీ కాలనీలో 1,134ప్లాట్లు

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న ఎంఐజీ కాలనీ 1,134 పాట్లు ఏర్పాటు చేశారు. అందులో 150 గజాలతో 447 ప్లాట్లు, 200 గజాలతో 360 ప్లాట్లు, 240 గజాలతో 199 పాట్లు, ఇతర సైజ్ ప్లాట్లు 128గా విభజించారు. గజం రేటు ప్రాథమికంగా రూ.5100గా ఉంది. అంటే సెంటు ధర రూ.2.44లక్షలు నిర్ణయించారు.

సకల సదుపాయాల కల్పన

110.10 ఎకరాల్లోని ఎంఐజీ కాలనీలో 11.01 ఎకరాల్లో పార్కులు, ప్లేగ్రౌండ్స్, విద్యా-వైద్య సదుపాయాల కల్పనకు, విశాలమైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు 37.85 ఎకరాలు కేటాయించారు. ప్రభుత్వ కార్యకలాపాలకు 5.59 ఎకరాలు వదిలేశారు. రోడ్లు-డ్రైనేజీ వ్యవస్థతో పాటు తాగునీటి కుళాయిలు, విద్యుత్ సౌకర్యం, కమ్యూనికేషన్ కనెక్టివిటి వంటి సకలవసతులు కాలనీలో కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. ఎమ్మిగనూరు,ఆదోని పరిసర ప్రాంతాల్లో ఉద్యోగాలు నిర్వహించే వారికి ఎంఐజీ కాలనీ చాలా సౌకర్యవంతంగా ఉండే అవకాశం ఉండటంతో ఉద్యోగులు ఇక్కడ ప్లాట్లు కొనేందుకు ముందుకొచ్చారు.

రూ.11కోట్ల విక్రయాలు

బనవాసి స్మార్ట్‌టౌన్‌షిప్‌లో 161మందికి ప్లాట్లను కేటాయించారు.79 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. రూ.11 కోట్లకు పైగా కుడాకు జమ అయ్యాయి. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్, ప్రభుత్వం మారడంతో దరఖాస్తులకు బ్రేకులు పడ్డాయి. అధికారంలోకి వచ్చిన కూటమి పెద్దలు స్మార్ట్‌టౌన్‌షిప్‌లపై శ్రద్ధ చూపడంలేదు. స్మార్ట్‌టౌన్‌లో రోడ్లు, డ్రైనేజీ, డివైడర్లు ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, ఉద్యానవనాలు తదితర మౌలిక వసతుల కల్పనకు రూ.58కోట్లతో టెండర్లు పిలిచారు. రెండు కంపెనీలు ఈ టెండర్లల్లో పాల్గొన్నా మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ నుంచి ఇంకా క్లియరెన్స్‌లు రావాల్సి ఉందని కుడా ఈఈ సురేష్‌కుమార్ తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఉద్యోగులు, మధ్య తరగతి వర్గాల వారి కోసం ఎంఐజీ కాలనీ ఏర్పాటు చేయటం వల్ల ఉద్యోగుల్లో సొంతింటి కల సాకారం కానుంది. అప్పట్లో స్మార్ట్ టౌన్‌లపై దుష్ప్రచారం చేయడంతో చాలామంది ముందుకు రాలేదు. ప్రస్తుత జిల్లా ఉన్నతాధికారులు ముందుగా కాలనీ లే అవుట్‌లో మౌలిక వసతులు కల్పించటం మొదలు పెట్టాలి. అందరికి అందుబాటులో ఉండేలా ధరలు ఉండాలి.

– కురువ మద్దులేటి, తాలూకా అధ్యక్షుడు -ఏపీ ఎన్జీవో సంఘం

ప్రభుత్వం చొరవ చూపాలి



మద్య తరగతి వర్గాల వారికోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బనవాసి వద్ద స్మార్ట్‌టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. అయితే స్మార్ట్‌టౌన్‌షిప్‌పై అప్పట్లో కొన్ని వర్గాలవారు చేసిన చెడు ప్రచారాలతో ఉద్యోగులు, వ్యాపారులు అయోమయంలో పడి దరఖాస్తులు చేసుకోలేదు. మౌలిక వసతుల కల్పనకు రూ.58కోట్లతో ఖరారైన టెండర్లకు ప్రభుత్వం క్లియరెన్స్‌లు ఇచ్చి పనులు మొదలయ్యేలా చూడాలి.

– బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్

ఉరుకుందలో సుదర్శన హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో గురువారం సుదర్శన హోమాన్ని భక్తుల మధ్య ఘనంగా చేపట్టారు. స్వాతి నక్షత్రంలో సుదర్శన హోమం నిర్వహించడం వల్ల శుభాలు జరుగుతాయని, అందుకే ఈ హోమ కార్యక్రమాన్ని ఉరుకుందలో గత నెల నుంచి ప్రారంభించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే జంటలకు దేవాలయం వారు రూ.1,500 టికెట్టు నిర్ణయించడంతో చాల మంది భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో పూజలు చేసి ఈ హోమం కార్యక్రమంలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. హోమంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరుపున శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫొటో, దేవస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం లడ్డు బాక్స్‌లో రెండు లడ్డులను అందజేశారు.



హోమానికి పూర్ణాహుతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

ఆదోని రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి జీవితంలో స్థిరపడాలని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని భీమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు నిర్ణయించిన గమ్యానికి చేరుకునేందుకు పట్టుదల, ఏకాగ్రత ముఖ్యమన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాల గురించి, వాటి పర్యవసానాల గురించి తెలియజేశారు అనంతరం డ్రగ్ అబ్యూస్‌పై నిర్వహించిన ఎస్‌ఏలో గెలుపొందిన విద్యార్థులకు జడ్జి బహుమతులను అందజేశారు.



ఎస్‌ఏ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న జడ్జి యజ్ఞ నారాయణ

గ్రామాల్లో వైభవంగా దేవర

కోసిగి: కోసిగి మండలంలోని అగసనూరు, సాతనూరు, దుద్ది, కొల్మాన్‌పేట, వందగల్లు, గౌడుగల్లు, జుమ్మాలదిన్నె, చింతకుంట గ్రామాల్లో రెండు రోజుల పాటు గ్రామ దేవతలు మారెమ్మ దేవి, దేవమ్మ దేవిల దేవర ఉత్సవాలు కడు వైభవంగా జరిగాయి. గురువారం రెండవ రోజున ఆయా గ్రామాల్లో దేవర సంబరాలు ఆకట్టుకున్నాయి. గ్రామాల్లో గాజులు, బొమ్మలు, మిఠాయిల దుకాణాలతో పాటు పిల్లల జంపింగ్, జారుబండలు ఏర్పాటు చేశారు. అలాగే అగసనూరు గ్రామంలో చిన్నారుల గ్రామీణ జానపద కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అగసనూరు, సాతనూరు గ్రామాల్లో రాత్రి డ్రామా ప్రదర్శించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అగసనూరులో అలరిస్తున్న కోలాటాం

పోరుబాటకు తరలిరండి

- పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలి
- నేడు నిరసన కార్యక్రమం
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఎన్నికల ముందు ఒక్క పైసా కూడా కరెంట్ బిల్లులు పెంచనని రాష్ట్ర ప్రజలకు చంద్రబాబునాయుడు వాగ్దానం చేసి, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచేవిధంగా విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా.మధుసూదన్ అన్నారు. ఇదే బాబుతీరు అని ఎద్దేవ చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్యే సాయి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, తాను అధికారంలోకి వస్తే ఒక్క పైసా కూడా పెంచనని నమ్మబలికి, నేడు అధికారంలోకి వచ్చిన పిమ్మట రాష్ట్ర ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈనెల 27వ తేదీన శుక్రవారం ఆదోనిలో నిర్వహిస్తున్న విద్యుత్ పోరుబాట కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, రైతులు, వ్యాపారవేత్తలు సైతం తరలిరావాలని పిలుపునిచ్చారు. భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా ఆలూరు రోడ్డులోని విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం వరకు వెళ్లి ఆందోళనను చేపట్టనున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ డా.మధుసూదన్, కార్యకర్తలు

ఎమ్మెల్యే గారు..అబద్ధాలు వీడి అభివృద్ధికి పాటుపడండి!

ఎమ్మెల్యే గారూ.. అబద్ధాలు వీడి ఆదోని అభివృద్ధికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది, ఇప్పటివరకు మీరు చేసిందేమిటి, ముస్ముందు చేసేదేమిటి, ఆదోని నియోజకవర్గ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సాయి జపం వీడి.. ఆదోని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించాలన్నారు. నేను చెబితే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెప్పినట్లేనని గొప్పలు చెప్పుకోవడం కాదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హితవుపలికారు. అలాగే నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు పూర్తిచేసి ప్రారంభించేందుకు కృషి చేయాలన్నారు. మెడికల్ కళాశాల విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణంలో ఆగిపోయిన ఈద్గా, ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఆటోనగర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు పనులను పూర్తి చేయాలని, అప్పుడు ఆదోని నియోజకవర్గంలో అభివృద్ధి సాధించినట్లు అవుతుందని తెలిపారు. ఆదోని బైపాస్ రోడ్డు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఎందుకు అర్ధంతరంగా ఆగిపోయాయో కూటమి ప్రభుత్వమే సమాధానంగా చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు చలపతి, ఫయాజ్‌అహ్మద్, నాయకులు కామాక్షి నారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు నేడు మంత్రాలయంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా చేపట్టే పోరుబాట మహాధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ధర్నాకు అత్యధిక సంఖ్యలో పాల్గొని నిరసన గళం వినిపిద్దామన్నారు. నియోజకవర్గంలోని మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పార్టీ కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



పట్టణంలోని శివన్న నగర్ వద్ద ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ సమీపంలో ఇళ్ల నిర్మాణాలు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం ఆయన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు, ఇంకా పూర్తికాని వాటి వివరాలు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్, అమెనిటీ సెక్రటరీలను సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఆర్ఐ లక్ష్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కొల్మాన్‌పేట



గెలుపొందిన జట్టుకు నగదు అందజేస్తున్న గ్రామస్తులు

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామంలో గ్రామ దేవత మారెమ్మ దేవర ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కొల్మాన్‌పేట జట్టు విజేతగా నిలిచింది. గురువారం గ్రామంలో కొల్మాన్‌పేట, కామన్‌దొడ్డి గ్రామాల జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఇందులో కామన్‌దొడ్డి జట్టుపై కొల్మాన్‌పేట జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు ఉప్పలపాటి అర్జున్ రూ.20,000, రెండవ బహుమతి కామన్‌దొడ్డి జట్టుకు జ్ఞానేష్ రూ.15,000 నగదు బహుమతులు అందజేశారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కౌతాళం: ఆధార్‌కార్డు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారాజు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని హాల్వి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్‌క్యాంపును వారు గ్రామ కార్యదర్శి అబ్దుల్‌కరీంతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆధార్‌కార్డులు తీయించుకోని వారు తప్పక తీయించుకోవాలని, ప్రధానంగా 6సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లలు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5 నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఎమ్మిగనూరుటౌన్: యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అంతకుమునుపు యూటీఎఫ్ ప్రచార జాతలో భాగంగా అన్నమయ్య సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోరుతూ సమీక్షలు, తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కార్యదర్శి నవీన్‌పాటి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాగమణి, దావీదు.హేమంత్‌కుమార్, కొలన్న,శాంతిరాజు పాల్గొన్నారు.

అర్హులైన వారికి వృత్తి విద్యలో శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్:పట్టణ పరిధిలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, గీసర్, రెఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేర్ చేసేవారు, బ్యూటీషియన్ ,పెయింటర్ మొదలైన సేవలందించే వారికి ఆయా రంగాల్లో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గురువారం తెలిపారు. ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చిన అనంతరం శిక్షణ సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు జీవనోపాధి కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఆయా రంగాల్లో శిక్షణకు ఆసక్తి కల వారు ఈనెల 30వ తేదీ లోగా పాత మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 79016 10344, 79016 10376లను సంప్రదించాలన్నారు.

పేదల పక్షాన పోరాటానికి 'వందేళ్లు'

ఎమ్మిగనూరుటౌన్: పేద, బడుగు బలహీన వరాల జీవితాల మెరుగు కోసం సీపీఐ వందేళ్లుగా ఎనలేని పోరాటాలు చేస్తోందని పార్టీ పట్టణ కార్యదర్శి రంగన్న, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు బసవరాజులు అన్నారు. పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయం ఆవరణలో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు నీలకంఠప్ప ఆవిష్కరించారు.

సీపీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సీపీఐ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రముఖ వైద్యులు మాలకొండయ్య, శిల్ప, మనోజ్, హేమంత్‌కుమార్, మల్లికార్జు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రారంభించారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సీపీఐ పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను మండల ప్రధాన కార్యదర్శి ఎం.గోపాల్ ఆవిష్కరించారు.

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలో సీపీఐ వందవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి కుమారస్వామి, సీపీఐ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



రక్తదాన శిబిరంలో యువకుడికి జ్యూస్ అందజేస్తున్న వైద్యుడు మాలకొండయ్య, సీపీఐ నాయకులు

నందవరం : సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాటర్ ట్యాంక్ సమీపంలో ఆ పార్టీ జెండాను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ ఆవిష్కరించారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముబ్బు ఆంజనేయ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని విశ్వగురు జగజ్యోతి బసవేశ్వర భాషణాకారులు శ్రీనివాసమూర్తి అన్నారు. పెద్దహరివాణం కన్నడ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఇందిరాదేవి ఆధ్వర్యంలో గూళ్యం హీరేమఠ కుమారస్వామి కన్నడసేవా సమితి వారు 'శాలే గొందు కన్నడ కార్యక్రమం – ఉద్ఘాటన సమారంభం' కార్యక్రమం నిర్వహించారు.

ఒప్పందాలపై జీఓలు విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల సాధనకై 17రోజుల పాటు చేపట్టిన సమ్మెలో భాగంగా ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందాలపై జీఓలు విడుదల చేయాలని సీఐటీయూ నాయకుడు రాముడు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మునీంద్ర, కేశన్న, రఫీక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆదోని రూరల్: సమ్మె కాలపు ఒప్పందాలపై జీఓ విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణాధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ తదితరులు మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. నాయకులు కరెప్ప, కైలాస, ముని, శివ తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులకు భంగం కలిగించొద్దు

ఆదోని రూరల్: దళితుల హక్కులకు భంగం కలిగించొద్దని దళిత నాయకులు జైభీమ్ సాయిరామ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదారి కురువ, మాదాసి కురువలకు సంబంధించిన కురువలు బీసీలుగా ఉన్నారన్నారు. మాదారి, మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఆపాలని కోరారు. శాంతికుమార్, భాస్కర్, చంద్రశేఖర్, చాగి లింగప్ప, చిన్నతిక్కయ్య, నరేష్‌కుమార్, ఈరన్న బూరెల పాల్గొన్నారు.